## క్లుప్తంగా

### తహసీల్దార్‌పై ఫిర్యాదు



**పమిడిముక్కల:** కర్ణాటక రాష్ట్రం, బళ్లారి జిల్లా, హోస్‌పేట్ మున్సిపాలిటీలో మరణించిన పామర్తి లక్ష్మీపతికి పమిడిముక్కల మండలం వీరంకి గ్రామంలో మరణించినట్లుగా ధ్రువీకరణ పత్రం జారీ చేసిన అప్పటి తహసీల్దార్ జి.మహేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జేసీ గీతాంజలిశర్మకు వినతిపత్రం అందజేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని జేసీకి సమస్యను వివరించి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

### గుడివాడ డీఎస్పీగా ధీరజ్



**గుడివాడరూరల్:** శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడతానని గుడివాడ డీఎస్పీ వి. ధీరజ్ వినీల్ పేర్కొన్నారు.మొదటి పోస్టింగ్‌లో భాగంగా గుడివాడ డీఎస్పీగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది నూతన డీఎస్పీకి పూల బోకేలు అందజేసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానన్నారు. కోడిపందేలు, పేకాట, గంజాయి, ఇతర జూదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటానని, కోడిపందేలు, పేకాట, జూదాలు నిర్వహిస్తే సమాచారంఇవ్వాలన్నారు.

### బీరువా అందజేత

**మండవల్లి:** మండలంలోని పుట్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ కార్యాలయానికి మండలంలో పని చేస్తున్న టీచర్ల ఎస్సార్లు భద్రపరచడానికి రూ.15,000 విలువ గల బీరువాను సోమవారం అందజేశారు. బీరువాను మండల విద్యాశాఖాధికారి-1డి.రామారావు, విద్యాశాఖాధికారి ఎస్.రత్నసునాదం ప్రారంభించారు.

### డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

**మండవల్లి:** సార్వత్రిక ఎన్నికల్లో పీఓ, ఏపీఓ, ఓపీఓగా పని చేసిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించవలసినదిగా తహసీల్దార్ కె.గోపాల్‌కు యూటీఎఫ్ శాఖ తరఫున అయ్యవారి రుద్రవరం ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ పిచ్చోడు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏలూరు ఆర్డీవోతో సంప్రదించి డ్యూటీ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

### రుణాలు మాఫీ చేయాలి



**గుడివాడ టౌన్:** టిడ్కో గృహాలపై ఉన్న రుణాలను తక్షణమే మాఫీ చేయాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం ఎన్నికల అనంతరం పూర్తిగా రుణమాఫీ చేస్తీమని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం దీనిపై స్పందించి రుణమాఫీకి రూ.250 కోట్లు ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలన్నారు. అంతేకాక కాలనీకి తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటిని ఎక్కించే ప్రయత్నం చేయాలన్నారు. వాడుకునే నీటికోసం ప్రతి బ్లాక్ వద్ద బోరుపంపు ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్, స్కూల్, సచివాలయం, కల్యాణ మండపం వంటివి నిర్మించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

### ఇసుక లారీల అడ్డగింత



**తోట్లవల్లూరు:** భారీ లోడుతో వెళుతున్న ఇసుక లారీలను కార్మికులు అడ్డుకున్న ఘటన తోట్లవల్లూరులో జరిగింది. నార్తువల్లూరు క్వారీకి సంబంధించి తమకు ఉపాధి చూపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఇసుక ముఠా కార్మికులు ఇసుక రవాణా లారీలను సోమవారం అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు లారీలు ప్రధాన రహదారిపై నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా ప్రదేశానికి వచ్చి లారీలు రొయ్యూరు స్టాక్ యార్డు నుంచి బందరు పోర్టుకు వెళుతున్నాయని, అడ్డుకోవటం తగదని సూచించారు. నార్తువల్లూరు క్వారీకి ఇసుక రవాణ చేస్తున్న లారీలకు సంబంధం లేదని, ఇబ్బంది కలిగించవద్దన్నారు. కార్మికులు ఆందోళన విరమించటంతో లారీలు రాకపోకలు సాగించాయి.

### వృద్ధులకు చీరలు పంపిణీ

**గుడివాడ టౌన్:** శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో బి.దుర్గా ప్రసాద్-విజయలక్ష్మి వితరణతో ఈ సాయం చేశామన్నారు. తొలుత వృద్ధులకు అన్న సమారాధన చేసి చీరలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, ఎం.సత్యం, జె.మునీంద్ర, కె.హరిబాబు, జె.తాతారావు పాల్గొన్నారు.

# ఆ చిత్రాలు అమర ప్రసాదం

- సమాజ హితమే లక్ష్యంగా డాక్యుమెంటరీలు
- డాక్యుమెంటరీల రూపలక్పనలో అమరప్రసాద్ అందెవేసిన చేయి
- సందేశాత్మకమే పరమావధిగా చిత్రాల రూపకల్పన
- తాతల స్ఫూర్తిగా సేవా కార్యక్రమాలు



పేద విద్యార్థినులకు పారితోషికాలను అందజేస్తున్న చిరంజీవమ్మ, అమరప్రసాద్ (ఫైల్)

**గుడ్లవల్లేరు:** సమాజంలో ప్రజలకు మేలు చేసే సినిమాలతో పాటు డాక్యుమెంటరీల రూపకల్పనే ధ్యేయంగా పెట్టుకున్నారు ఆ నిర్మాత. తన తాతల స్ఫూర్తి ప్రజా హితమైన చిత్రాల రూప కల్పనకు పురికొల్పిందని ఆయన చెబుతున్నారు. ఆయనే గుడ్లవల్లేరు మండలం కౌతవరానికి చెందిన సినీ నిర్మాత చల్లపల్లి అమరప్రసాద్.

**నటుడు అమితాబ్ చేతులమీదుగా నంది అవార్డు..**

చిన్నప్పుడు అమితాబ్ పాటను పాడుతూ.. దానికి అనుగుణంగా చిందేసేందుకు మక్కువ చూపేవారు ప్రసాద్. అలాంటి అభిమాన హీరో చేతుల మీదుగా నంది అవార్డు వచ్చిందంటే ఆ ఆనందానికి అవధులుంటాయా? స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ప్లాస్టిక్ నియంత్రణ డాక్యుమెంటరీకే అమితాబ్ చేతుల మీదుగా నంది పురస్కారం లభించింది. యండమూరి నవలలపై చేసిన డాక్యుమెంటరీకి నటుడు చిరంజీవి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు, నగదు బహుమతిని పొందారు. డాక్యుమెంటరీల మేకింగ్‌లో ప్రతిభను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి 1994లో రెండు, 1997లో ఒకటి, 2000లో ఒకటి, 2012లో రెండు నంది అవార్డులు వచ్చాయి. 1+1ఓటీటీ వెబ్ సిరీస్‌ను కూడా ఆయన రూపొందించారు. అమెరికన్ యూనివర్సిటీ అమరప్రసాద్ డాక్యుమెంటరీల సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చింది.



అమితాబ్ చేతుల మీదుగా నంది అవార్డును అందుకుంటున్న దృశ్యం (ఫైల్)



కెమెరాలో షూట్ చేస్తున్న అమర్

**తాతల బాటలోనే..**

అమరప్రసాద్ తాతలు చేసిన ప్రజాహిత కార్యక్రమాలనే స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆ బాటలోనే సీరియల్స్, డాక్యుమెంటరీ ఫిల్ములు, ప్రకటనల్ని ప్రభుత్వ రంగ సంస్థలకు చేస్తున్నారు. తల్లి చిరంజీవమ్మతో పాటు పేదలకు సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. అమరప్రసాద్ మాటల్లో.. కౌతవరం అమ్మమ్మ ఊరు. తాత స్వాతంత్ర్య సమరయోధుడు తాళ్లూరి మంగపతిరావు. ఆయన ఉద్యమం కోసం పెద్దలు ఇచ్చిన ఆస్తులన్నీ పోరాటానికే ఉపయోగించేశారు. మాజీ డీజీపీ టి.ఎస్.రావు బంధువే. ఇక్కడ పదో తరగతి వరకు చదివా. నాన్న ఊరు చల్లపల్లి. మా తాత ప్రజా పోరాట యోధుడు చల్లపల్లి నారాయణరావు. ఆయన అప్పట్లో భూ పోరాటం చేసి జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఇప్పటికీ ఆయన స్మారకార్థం చల్లిపల్లిలో స్థూపం ఉంది. కోడూరు దగ్గరలో ఒక కాలనీకి నారాయణరావు కాలనీ అనే పేరు పెట్టుకున్నారు.

### ప్రస్థానం ఇలా..

- మంగపతిరావు, నారాయణరావు స్ఫూర్తే సామాజిక స్పృహను ఇచ్చే డాక్యుమెంటరీ ఫిల్ములకు సంబంధించిన ప్రకటనల మేకింగ్‌కు పురికొల్పింది.
- రైల్వేలో దొంగతనాలు జరగకుండా ప్రయాణికులు అప్రమత్తంగా ఉండే ప్రకటన తయారీ.
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వ రంగ ప్రకటనలు, వందకు పైగా డాక్యుమెంటరీలు.
- ప్లాస్టిక్ నియంత్రణ డాక్యుమెంటరీకి దర్శకుడిగా కృషి.
- 'ఓ చిట్టెమ్మ కథ' అనే మత్స్యకారుల జీవన శైలికి సంబంధించిన డాక్యుమెంటరీ చేయటం బాగా నచ్చింది.
- తాత చల్లపల్లి నారాయణరావు జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకుని తీసిన 'అమరవీర' అనే డాక్యుమెంటరీకి మంచి స్పందన.
- అపరంజి అనే సీరియల్‌లోనే ప్రతి నాయకుడి పాత్రలో నటన.
- యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వంలో 'దుప్పట్లో మిన్నాగు' అనే సినిమాకు అనేక భాషల్లో నిర్మాతగా.
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రకటనల రూపకల్పన.
- పేద విద్యార్థుల్లో మేటి అయిన వారికి నగదు ప్రోత్సాహకాలు, పేద కుటుంబాలకు సహాయ సహకారాలు చేస్తున్నానని' అమరప్రసాద్ తెలిపారు.

## ప్రతి అర్జీకి గడువులోగా పరిష్కారం చూపాలి

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ డీకే బాలాజీ
- పామర్రులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



పామర్రులో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**పామర్రు:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమం సోమవారం పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజల నుంచి స్వయంగా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చూపాలని అన్నారు. అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదవుతుంటాయని, అధికారులు ఎప్పటి కప్పుడు వాటిని పరిష్కరించాలన్నారు. నమోదైన అర్జీలకు అవసర మైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. పరిష్కారం కాని వాటికి తగిన కారణాలను తెలపాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిశితంగా పరిశీలించారు. పామర్రు మండల పరిధిలోని కురుమద్దాలి ఎస్సీ కాలనీలో శ్మశాన వాటిక పుల్లేరు కాలువ గట్టున పల్లంగా ఉందని శ్మశాన వాటికకు మెరక పనులు నిర్వహించాలని, గ్రామంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఇచ్చిన అర్జీని కలెక్టర్ పరిశీలించి తగు విధమైన పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. వీరాంజనేయ కాలనీ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. తొలుత పామర్రు పరిధిలోని జగనన్న కాలనీని పరిశీలించారు. ప్రజలకు ఇళ్ల స్థలాలను ఇచ్చే విధంగా చర్యలు తసుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రజల నుంచి 45 అర్జీలు స్వీకరించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, పీసీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, డీసీ చైర్మన్ కొనసరాజు వెంకటేశ్వరరావు, పామర్రు తహసీల్దార్ గూడపాటి రవికాంత్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలపై కొనసాగుతున్న విచారణ



మనోహర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

**తోట్లవల్లూరు:** పంట నష్టపరిహారం మంజూరులో జరిగిన అవకతవకలపై విచారణ కొనసాగుతోంది. దీనికి సంబంధించి జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మనోహర్ సోమవారం విచారణ నిర్వహించారు. సుమారు వారం రోజుల కిందట మొదటిసారిగా ఏవో కార్యాలయంలో విచారణ చేశారు. అనంతరం హార్టికల్చర్ అధికారులు విచారణ చేయగా ప్రస్తుతం డీడీ విచారణ చేపట్టారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పలువురు రైతులు ఆయనను కలిసి తాము మినుము, చెరకు పంటలు సాగు చేసి నష్టపోయామని, పరిహారం మాత్రం తమకు రాలేదని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుంచి తగిన పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిహారం మంజూరుకు సంబంధించిన జాబితాలు పరిశీలిస్తున్నట్లు మనోహర్ రైతులకు తెలియజేశారు. ఎంఏవో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## హిందూ పరిరక్షణపై దృష్టి సారించాలి



ప్రమాణం చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

**గుడ్లవల్లేరు:** హిందూ పరిరక్షణకు విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి అల్లూరి కాంతారావు పిలుపునిచ్చారు. సోమవారం వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలోని ఒక ప్రైవేట్ భవనంలో ఆ సంఘ మహిళా ఉపాధ్యక్షురాలు చిట్టి కుమారి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణా జిల్లా ధర్మ యాత్ర మహా సంఘ సయోజన్ ఉత్సవాల్లో భాగంగా తీర్థ యాత్రలను మహా సంఘ్ సభ్యులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గరికపాటి వెంకట్రావు, గుడివాడ నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండాలి

**మండవల్లి:** వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండాలని ఏడీఏ వెంకటరమణి పేర్కొన్నారు. ఏడీఏ కార్యాలయంలో మండవల్లి, ముదినేపల్లి మండలాల వీఏఏలకు ఏడీఏ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఏఏలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మినుము వేసిన రైతులు సరైన నీటి యాజమాన్యం, సస్య రక్షణ చర్యలు పాటించాలన్నారు. మినుము పైరులో అధికంగా నీరు పెడితే ఎకరాకు 600 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ పిచికారీ చేయాలని రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. దీని వలన వేరుకుళ్లు, కాండం కుళ్లు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. వారం తర్వాత ఎం-45 పిచికారీ చేయాలన్నారు. ఎంఏవో ఎస్‌కే జరీనా మాట్లడుతూ రబీలో వేసిన పంటలకు ఈ-పంట, ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మండవల్లి, ముదినేపల్లి గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### కిశోర వికాసంపై అవగాహన



**నందివాడ:** మండలంలోని పుట్టగుంట గ్రామంలో కిశోర వికాసంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త తేజశ్రీ పిల్లలకు, తల్లిదండ్రులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల నిండని బాలికలకు వివాహం చేయరాదన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే పోలీసులకు చైల్డ్ హెల్ప్ లైన్‌కు తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మహాలక్ష్మి ఏఎన్‌ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ



**పామర్రు:** విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి పీబీ సాల్మన్‌రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థుల హాజరు, ప్రీఫైనల్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణాతరగతులను నిర్వహించి వారి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం డొక్కు సీతమ్మ మధ్యాహ్న పథకం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అరుణ ప్రభ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అ'పూర్వ'సమ్మేళనం



స్కూల్ డైరెక్టర్లతో పూర్వ విద్యార్థులు

**గుడివాడ టౌన్:** స్థానిక విద్యావికాస్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. 2010 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 15 సంవత్సరాల అనంతరం కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుని ఆనందంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న తామంతా తిరిగి ఇక్కడ కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు ఎం.సుబ్బారావు, కె.సాంబశివరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే ఆయిల్‌పామ్

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



కొండవరంలో ఆయిల్‌పామ్ తోటలో మినుము పైరును పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, తదితరులు

**కొండవరం(మొవ్వ):** ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని రైతులకు లాభాలను ఇచ్చే పంట ఆయిల్ పామ్ అని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఈ పంట సాగుకు రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో కలిసి మండలంలోని కొండవరం గ్రామంలో కొసరాజు వెంకటలక్ష్మి దాసు 13 ఎకరాల్లో చేపట్టిన ఆయిల్ పామ్ తోటను కలెక్టర్ బాలాజీ సోమవారం సందర్శించారు. తోటలో అంతర పంటగా వేసిన మినుము పైరును ఆసక్తిగా పరిశీలించారు. పంట సాగు వివరాలను రైతుతో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వరదలను ఆయిల్‌పామ్ చెట్లు తట్టుకొని నిలబడ్డాయని రైతు తెలిపారు. ఆసక్తిగల రైతులను ఆయిల్ పామ్ సాగు క్షేత్రాలకు తీసుకెళ్లి ఈ పంట సాగులో లాభాలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించి, వారు కూడా సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు 143 మొక్కలను వంద శాతం సబ్సిడీతో ఉచితంగా అందిస్తామన్నారు. ఆయిల్ పామ్ పంటను విక్రయించేందుకు శ్రమ పడనవసరం లేదని, నేరుగా సంబంధిత కంపెనీలు రైతు వద్దకు వచ్చి మద్దతు ధరకే కొనుగోలు చేస్తాయని వివరించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 3ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పాచర్ల విజయప్రసాద్, ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి, ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సమాధుల దొడ్డిని సర్వే చేయించండి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**గుడివాడ టౌన్:** స్థానిక 1వ వార్డు నాగవరప్పాడు చంద్రయ్య డ్రైయిన్ పక్కన ఉన్న రెండెకరాల సమాధుల దొడ్డి మూడు వంతులు ఆక్రమణకు గురైందని, దానిని వెంటనే సర్వే చేయించి ప్రహరీ నిర్మించాలని క్రైస్తవ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాధుల దొడ్డి ఆక్రమించుకున్నవారు మిగిలిన స్థలంలో శవాలను పూడ్చడం కూడా అడ్డుకుంటున్నారన్నారు. మిగిలిన కొద్దిపాటి స్థలం సైతం కబ్జా చేసేందుకు అక్కడ నివాసం ఉంటున్నవారు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే దీనిని సర్వే చేయించి ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.జోసఫ్, డి.కరుణాకర్, ఆర్.రాజు, సీహెచ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాము



సాయం చేస్తున్న కిరణ్‌పాల్

**గుడ్లవల్లేరు:** వడ్లమన్నాడులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందించారు. బాధితులు జంగం శ్రీనివాసరరావు, జంగం మునలయ్య, నత్తా సుబ్బారావు, మాసవరపు రోశయ్య కుటుంబాలకు సోమవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదుగా నిత్యవసరాలు, బియ్యం, వంట సామాన్లను సాయంగా అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ టి.విజయ సారథి, డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు మాదాసు శ్రీనివాసరరావు, కొడాలి రామరాజు, గరికపాటి రాంబాబు, పెన్నేరు రమేష్, సర్పంచి కటికల జ్యోతిలత తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం బెరాకా మినిస్ట్రీస్ అధినేత ఎం.కిరణ్‌పాల్ తన సొంత ఖర్చులతో బాధితులకు బియ్యం, సరుకులు, దుస్తులు, వంట సామాన్లను పంపిణీ చేశారు. గ్రామ ప్రముఖుడు భట్టు శ్యామ్‌ప్రసాద్, పాస్టర్లు నాగిశెట్టి డానియేలు, ఉజ్జీవం తదితరులు పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



బొమ్ములూరులో పశువుకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, పక్కన ఉప సంచాలకులు శ్రీనివాస్

**గుడివాడరూరల్:** ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత బొమ్ములూరు గ్రామ పరిధిలోని పశువులకు పలు రకాల టీకాలను వేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో పశువులు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగానే పశు పోషకులు పశువులకు టీకాలు, మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జగన్నాథరావు, గుడ్లవల్లేరు ఏవీహెచ్ సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**మండవల్లి:** మండలంలో పశుఆరోగ్య శిబిరాలను ప్రారంభించారు. సోమవారం లింగాల, అయ్యవారి రుద్రవరం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 34 పశువులకు 36 లేగ దూడలకు 120 గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగించారని పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. పది గర్భవాతం ఉన్న పశువులకు చికిత్స అందించి 300 గొర్రెలకు పాక్సు టీకాలు వేశామన్నారు. మండలంలోని పశుసంవర్ధక శాఖ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి రోజుకు రెండు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21వ తేదీన పెరికెగూడెం, చింతపాడు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

**కైకలూరు:** ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు పఠాన్ ముస్తాఫాఖాన్ అన్నారు. మండలంలోని శృంగవరప్పాడు, వేమవరప్పాడు, కలిదిండి మండలం కొచ్చెర్ల, భాస్కరరావుపేట గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను సోమవారం నిర్వహించారు. పశువులు సూడి కట్టడానికి వైద్యం, ఎద ఇంజెక్షన్లు, గేదెలు, దూడలు, గొర్రెలకు నట్టల, జలగ నివారణ వ్యాక్సిన్లు ఉచితంగా అందించామన్నారు. ఈ వైద్య శిబిరాలు ఈ నెల 31 వరకు నిర్వహిస్తారన్నారు. పశు వైద్యులు ప్రహర్స, ఫణీంద్ర, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.